ప్రొఫెసర్ సాయిబాబా నిర్దోషి

- బాంబే హైకోర్టు కీలక తీర్పు
- అభియోగాలను ప్రాసిక్యూషన్ రుజువు చేయలేకపోయిందని వెల్లడి
- సుప్రీంకోర్టుకు మహారాష్ట్ర సర్కారు

నాగ్‌పూర్, మార్చి 5: మావోయిస్టులతో సంబంధాల కేసులో పదేండ్ల క్రితం అరెస్టయిన ఢిల్లీ యూనివర్సిటీ మాజీ ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబాను నిర్దోషిగా పేర్కొంటూ బాంబే హైకోర్టు నాగ్‌పూర్ బెంచ్ మంగళవారం కీలక తీర్పు వెలువరించింది. సాయిబాబాపై మోపిన అభియోగాలకు సరైన ఆధారాలు చూపించటంలో ప్రాసిక్యూషన్ విఫలమైందని కోర్టు తెలిపింది. 54 ఏండ్ల సాయిబాబాకు విధించిన జీవిత ఖైదును కూడా కోర్టు పక్కన పెట్టింది. సాయిబాబాతో పాటు ఈ కేసులో నిందితులుగా ఉన్న మరో ఐదుగురిని కూడా నిర్దోషులుగా ప్రకటిస్తూ న్యాయమూర్తులు వినయ్ జోషి, వాల్మీకి ఎస్‌ఏ మెనెజెస్‌లతో కూడిన డివిజన్ బెంచ్ తీర్పు ఇచ్చింది. యూఏపీఏ కింద నిందితులను ప్రాసిక్యూట్ చేయటానికి పొందిన అనుమతి చట్టవిరుద్ధమైనదని, ఇది సరైంది కాదని, అందువల్ల ఆ అనుమతి అర్థంలేనిదని ధర్మాసనం పేర్కొన్నది. శారీరక వైకల్యం వల్ల వీల్‌చైర్‌కే పరిమితమైన ప్రొఫెసర్ సాయిబాబా 2014లో ఈ కేసులో అరెస్టయ్యారు. అప్పటి నుంచి నాగ్‌పూర్ సెంట్రల్ జైలులోనే ఉన్నారు. బాంబే హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ మహారాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది.

పదేళ్ల పోరాటం ఫలించింది

పదేండ్ల సుదీర్ఘ న్యాయపోరాటం ఫలించిందని సాయిబాబా భార్య వసంత కుమారి తెలిపారు. పోరాట సమయంలో తన భర్తకు మద్దతుగా నిలిచిన వారందరికీ ఆమె కృతజ్ఞతలు తెలిపారు. నేటి కోర్టు తీర్పు తమకు ఎంతో ఉపశమనం కలిగించిందని చెప్పారు. కానీ ఏం జరుగుతుందోనన్న ఆందోళన మాత్రం అలాగే ఉండిపోయిందన్నారు. 2022లో కూడా సాయిబాబా నిర్దోషిగా ప్రకటించారు. కానీ ఆ నిర్ణయాన్ని తిరిగి సవాల్ చేశారు. ఇప్పుడు కూడా అలాంటిది జరగవచ్చని తాము ఆందోళన చెందుతున్నట్టు చెప్పారు. కాగా, సాయిబాబాతో పాటు మరో ఐదుగురిని బాంబే హైకోర్టు నిర్దోషులుగా ప్రకటించడాన్ని సీపీఐఎం తెలంగాణ రాష్ట్ర కమిటీ హర్షిస్తున్నదని, ఆ పార్టీ కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు.

నీటి కోసం యుద్ధమే!

- కర్ణాటక రాష్ట్రం అంతటా తాగునీటికి ప్రజల కటకట
- గొయ్యి తవ్వి నీటిని దాచుకొనేలా దుస్థితి
- నీటిని వృథా చేస్తే రూ.5 వేల జరిమానా
- గేటెడ్ కమ్యూనిటీల్లో కొత్త నిబంధనలు
- యథేచ్ఛగా రెచ్చిపోతున్న నీటి ట్యాంకర్ల మాఫియా

బెంగళూరులోని రాజేశ్వరినగర్ వాటర్ ఏటీఎం వద్ద నీళ్ల కోసం జనం బారులు(ఫైల్)

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, మార్చి 5 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్‌పాలిత కర్ణాటకలో తాగునీటి కటకట మొదలైంది. రాజధాని బెంగళూరు సహా రాష్ట్రంలోని ఏడు వేలకు పైగా గ్రామాలు, పట్టణాల్లో తాగునీటి సంక్షోభం తీవ్రస్థాయికి చేరుకుంది. నీటికోసం రోజూ యుద్ధాలు చేసే పరిస్థితి వస్తున్నదని ప్రజలు వాపోతున్నారు. ఎండాకాలం రాకముందే ఇలా ఉంటే, రానున్న రోజుల్లో తమ పరిస్థితి ఏమిటని బెంబేలెత్తిపోతున్నారు. వర్షాభావం, కరువు పరిస్థితులను అంచనా వేసి ముందస్తు ప్రత్యామ్నాయ చర్యలను చేపట్టడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమయ్యిందని మండిపడుతున్నారు.

పెచ్చరిల్లుతున్న ట్యాంకర్ల మాఫియా

ఒకవైపు తాగునీటి కటకటతో అల్లాడిపోతున్న కర్ణాటక ప్రజలకు ప్రైవేట్ వాటర్ ట్యాంకర్ల మాఫియా చుక్కలు చూపిస్తున్నది. 12 వేల లీటర్ల ట్యాంకర్ ధర గతంలో రూ.700గా ఉంటే ప్రస్తుతం రూ. 2 వేల వరకూ ప్రైవేట్ వాటర్ ట్యాంకర్స్ యజమానులు వసూలు చేస్తున్నట్టు సామాన్యులు, ఐటీ ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో నగరంలోని ప్రైవేట్ వాటర్ ట్యాంకర్స్ అన్నింటినీ స్వాధీనం చేసుకోనున్నట్టు కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ తాజాగా ప్రకటించారు. ప్రైవేట్ బోర్‌వెల్ నిర్వాహకులు, ప్రైవేట్ వాటర్ ట్యాంకర్స్ యజమానులు 'బెంగళూరు వాటర్ సైప్లె, సీవరేజ్ బోర్డ్' (బీడబ్ల్యూఎస్‌ఎస్‌బీ) వద్ద మార్చి 7లోగా రిజిష్టర్ చేసుకోవాలని కాంగ్రెస్ సర్కార్ ఆదేశాలు జారీచేసింది. మరోవైపు నీటి సరఫరాను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం రూ.556 కోట్లు మంజూరుచేసినట్లు డిప్యూటీ సీఎం తెలిపారు. ఖాళీ పాల ట్యాంకులను నీటి నిల్వకు, సరఫరా కోసం ఉపయోగించనున్నట్లు తెలిపారు.

వృథా చేస్తే రూ. 5 వేల జరిమానా

తాగునీటి సంక్షోభం బెంగళూరునూ వెంటాడుతున్నది. నగరంలోని యలహంక, కనకపుర, వైట్‌ఫీల్డ్ ప్రాంతాల్లో సమస్య మరింత ఎక్కువగా ఉన్నది. దీంతో నీటి వృథాను కట్టడి చేసేందుకు వైట్‌ఫీల్డ్‌లోని ఓ హౌసింగ్ సొసైటీ కీలక నిర్ణయం తీసుకుంది. అనవసరంగా నీటిని వృథా చేసే వారికి రూ.5 వేలు జరిమానా విధిస్తామని హెచ్చరించింది. నీటి వృథాను పర్యవేక్షించేందుకు ప్రత్యేకంగా భద్రతా సిబ్బందిని నియమించనున్నట్లు తెలిపింది.

ఏడడుగుల గొయ్యి తీసి..

తాగునీటి కష్టాలను తప్పించుకోవడానికి అంకోలా జిల్లాలోని శింగన్‌మక్కీ గ్రామ మహిళలు వినూత్న ఆలోచన చేశారు. ఇండ్ల మధ్యలో గొయ్యిలు తీసి ఇటుకలతో ఏడడుగుల లోతు చిన్న బావిని నిర్మించుకొంటున్నారు. తాగునీరు లభించినప్పుడు ఆ బావిలో నిల్వ ఉంచుకొంటున్నారు. అవసరమైనప్పుడు, ఆ నీటిని శుద్ధిచేసి తాగడానికి, వంటకు వాడుకొంటున్నట్టు మహిళలు పేర్కొన్నారు.

మా బావి కూడా ఎండిపోయింది

బెంగళూరులో 3 వేలకు పైగా బోరుబావుల్లో నీళ్లు లేకుండా పోయాయి. మా ఇంట్లోని బోరు బావి కూడా ఎండిపోయింది. ఇది ఎంతో క్లిష్టమైన పరిస్థితి. అయినప్పటికీ, ప్రజలకు తక్కువ ధరకే నీటిని సరఫరా చేయడానికి ప్రయత్నిస్తున్నాం.

– డీకే శివకుమార్, డిప్యూటీ సీఎం

యూపీ పేపర్ లీక్ కేసు.. రిక్రూట్‌మెంట్ బోర్డు చైర్‌పర్సన్ తొలగింపు

లక్నో,: పోలీస్ కానిస్టేబుల్ నియామక పరీక్ష ప్రశ్నపత్రం లీకేజీపై ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. యూపీ పోలీస్ రిక్రూట్‌మెంట్ అండ్ ప్రమోషన్ బోర్డు చైర్‌పర్సన్‌గా ఉన్న రేణుకా మిశ్రాను విధుల నుంచి తప్పిస్తూ యోగి ప్రభుత్వం మంగళవారం ఆదేశాలు జారీచేసింది. ఆమెను వెయిటింగ్ లిస్టులో ఉంచి విజిలెన్స్ డైరెక్టర్ రాజీవ్ కృష్ణన్‌కు బోర్డు అదనపు బాధ్యతలు అప్పగించింది. కానిస్టేబుళ్ల నియామకం కోసం ఫిబ్రవరి 17,18 తేదీల్లో నిర్వహించిన రాతపరీక్షకు 48 లక్షల మంది హాజరయ్యారు. అయితే ప్రశ్న పత్రాలు లీక్ కావడంతో దానిని రద్దు చేస్తున్నామని, ఆర్నెల్లల్లోగా తిరిగి నిర్వహిస్తామని ఫిబ్రవరి 24న ప్రభుత్వం తెలిపింది.

నదీ గర్భ మెట్రో

నేడు కోల్‌కతాలో ప్రారంభం

న్యూఢిల్లీ, మార్చి 5: దేశపు మొదటి నదీగర్భ మెట్రో మార్గాన్ని బుధవారం ప్రధాని మోదీ కోల్‌కతాలో ప్రారంభించనున్నారు. రూ.120 కోట్ల వ్యయంతో 16.6 కిలోమీటర్ల పొడవైన ఈ మార్గాన్ని ఇంజినీరింగ్ అద్భుతంగా పిలుస్తున్నారు. హుగ్లీ నది కింద నిర్మించిన ఈ మార్గం కోల్‌కతాలోని రెండు జంట నగరాలైన హౌరా, సాల్ట్ లేక్‌లను కలుపుతుంది. ఈ మార్గంలో మొత్తం మూడు స్టేషన్లు ఉండగా అందులో మూడు భూగర్భం(జలాంతర్గ)లో ఉన్నాయి. బుధవారం నుంచే ఈ మెట్రో సేవలు ప్రయాణికులకు అందుబాటులోకి రానున్నాయి.

నిరంకుశ, సైనిక పాలనకే భారతీయుల మొగ్గు!

ప్యూ రీసెర్చ్ సర్వే వెల్లడి

Pew Research Center

న్యూఢిల్లీ: భారత్‌లో మెజార్టీ ప్రజలు నిరంకుశ, సైనిక పాలనకు మద్దతు తెలుపుతున్నారని తాజా సర్వే నివేదిక పేర్కొన్నది. సర్వే చేసిన దేశాల్లో ఈ విషయంలో భారత్ అగ్రస్థానంలో ఉన్నదని ఇటీవల విడుదలైన 'ప్యూ రీసెర్చ్ సర్వే' వెల్లడించింది. ప్రాతినిధ్య ప్రజాస్వామ్యం, ప్రత్యక్ష ప్రజాస్వామ్యం, నిరంకుశత్వం, సైనిక పాలన సహా వివిధ పాలనా రూపాలపై 24 దేశాల్లోని పౌరుల నుంచి అభిప్రాయాలు సేకరించారు. సర్వేలో పాల్గొన్న వారిలో 67% మంది భారతీయులు నిరంకుశ పాలనకు మద్దతు తెలిపారని, ఇది 2017లో 55 శాతంగా ఉండేదని ప్యూ రిసెర్చ్ డాటా వెల్లడించింది. మిలటరీ పాలనకు కూడా భారత్‌లో భారీ మద్దతు ఉన్నదని, అన్ని దేశాల కంటే అధికంగా 72 శాతం మంది మద్దతు తెలిపారని సర్వే చెప్పుకొచ్చింది. మరోవైపు నిరంకుశ పాలనకు కెన్యాలో 52 శాతం మంది ఆమోదం పలుకగా.. ఇండోనేషియాలో 51% మంది ఓటేశారు. అమెరికాలో 26%, కెనడాలో 19%, యూకేలో 13% మంది మాత్రమే నిరంకుశ పాలనకు మద్దతు తెలిపారు. చట్టసభలు లేదా స్వతంత్ర న్యాయవ్యవస్థ జోక్యం లేకుండా బలమైన నాయకుడు నిర్ణయాలు తీసుకొనే అధికారం ఉన్న వ్యవస్థను పరిగణనలోకి తీసుకొంటారా? అని సర్వేలో పాల్గొన్న వారిని ప్రశ్నించారు.

ట్రైలర్ బాగుందా?

- 20 కోట్లు ఇవ్వకుంటే మళ్లీ బాంబు పేలుళ్లు
- కర్ణాటక సీఎం, డిప్యూటీ సీఎంలకు బెదిరింపు లేఖ

బెంగళూరు, మార్చి 5: మేం చూపించిన ట్రైలర్ (రామేశ్వరం కెఫేలో పేలుడు) బాగుందా? అంటూ గుర్తు తెలియని వ్యక్తులు కర్ణాటక సీఎం సిద్దరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌లకు ఈమెయిల్ ద్వారా లేఖ పంపారు. ఇది ట్రైలర్ మాత్రమే, తమకు రూ.20 కోట్లు (2.5 మిలియన్ డాలర్లు) ఇవ్వకుంటే.. మరిన్ని చోట్ల బాంబులు పెడతామని దుండగులు లేఖలో బెదిరింపులకు దిగారు. ఈ విషయాన్ని డీకే శివకుమార్ మంగళవారం మీడియాకు తెలియజేశారు. 'షాహిద్ ఖాన్ 10786' నుంచి తనకు బెదిరింపు ఈమెయిల్ వచ్చినట్టు చెప్పారు. రామేశ్వరం కెఫేలో బాంబు పేలుడు తర్వాత కర్ణాటక ఒక్కసారిగా ఉలిక్కిపడింది. తాజాగా సీఎం, డిప్యూటీ సీఎంలకు బెదిరింపు లేఖలు రావటం తీవ్ర కలకలం రేపుతున్నది. 'మూడు రోజుల క్రితం సీఎం సిద్దరామయ్య, నాకు ఈమెయిల్ ద్వారా బెదిరింపు లేఖలు వచ్చాయి. దీనిపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు' అని డీకే శివకుమార్ చెప్పారు. తనకు వచ్చిన బెదిరింపు మెయిల్‌ను మీడియాకు చూపించారు.

మౌత్ ఫ్రెష్‌నర్ తిని రక్తపు వాంతులు

గురుగ్రామ్‌లోని రెస్టారెంట్‌లో ఘటన.. ప్రమాదకర డ్రై ఐస్ కలవడమే కారణం

గురుగ్రామ్: మూడు కుటుంబాలు కలిసి సరదాగా రెస్టారెంట్‌కు వెళ్లాయి. భోజనం తర్వాత మౌత్ ఫ్రెష్‌నర్ తిన్నారు. అంతే, ఒక్కసారిగా కడుపులో విపరీతమైన నొప్పి, క్షణాల్లో రక్తపు వాంతులు చేసుకున్నారు. తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. బాధితుల అస్వస్థతకు మౌత్ ఫ్రెషనరే కారణమని, ఇందులో ప్రమాదకరమైన డ్రై ఐస్ కలిసిందని డాక్టర్లు గుర్తించారు. పోలీసులు రెస్టారెంట్ మేనేజర్‌ను అరెస్టు చేసి విచారణ జరుపుతున్నారు. పొరపాటున మౌత్ ఫ్రెష్‌నర్, డ్రై ఐస్ కలిసిపోయిందని మేనేజర్ అంగీకరించాడు.

డ్రై ఐస్ అంటే ఏంటి?

డ్రై ఐస్ అనేది కార్బన్ డయాక్సైడ్‌కు ఘన రూపం. ఇది –78 డిగ్రీల ఉష్ణోగ్రతతో అత్యంత చల్లగా ఉంటుంది. సాధారణంగా ఇది ఐస్ క్రీమ్, ఫ్రోజెన్ డెజర్ట్‌లను చల్లగా ఉంచేందుకు వినియోగిస్తారు. నేరుగా దీనిని తాకడం, తినడం ప్రమాదకరం. ఇది ఒకేసారి వెచ్చటి ఉష్ణోగ్రతలోకి చేరితే కార్బన్ డయాక్సైడ్ వాయువు ఉత్పత్తి అవుతుంది. శరీరంలోకి డ్రై ఐస్ వెళ్లినప్పుడు కూడా ఇదే జరిగి ఆక్సిజన్ స్థానంలో కార్బన్ డయాక్సైడ్ పెరిగిపోతుంది. దీంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యే ప్రమాదం ఉంటుంది.

ప్రియుడి మర్మాంగాలు కోసేసిన మహిళ

అపస్మారక స్థితిలో ఉన్న అతడిని రోడ్డుపై పడేసిన ప్రియురాలు

పాట్నా, మార్చి 5: బాయ్‌ఫ్రెండ్‌ను ఇంటికి పిలిచి ఓ మహిళ అతడి మర్మాంగాలను కోసేసింది. అపస్మారక స్థితిలో ఉన్న అతడిని నిర్దాక్షిణ్యంగా రోడ్డుపైన పడేసింది. బీహార్‌లోని బక్సర్ జిల్లాలో ఈ ఘటన చోటుచేసుకున్నది. బాధితుడు అనిల్ గోండ్ పరిస్థితి విషమంగా ఉందని, స్థానిక దవాఖానలో చికిత్స పొందుతున్నాడని పోలీసులు చెప్పారు. సదరు మహిళ ఎందుకు ఈ దాడికి తెగబడింది? అన్నది తెలియరాలేదు. ఈ ఘటనపై బాధితుడి సోదరుడు ప్రమోద్ కుమార్ మాట్లాడుతూ, 'అనిల్‌ను ఇంటికి పిలిపించటంలో కుట్ర ఉంది. ముందుగా దాడిచేసి తీవ్రంగా కొట్టారు. ఆ తర్వాత తన సోదరుడితో కలిసి ఆమె అనిల్ ప్రైవేట్ భాగాలను కోసేసింది' అని చెప్పాడు. ఉత్తరప్రదేశ్ కౌశాంబి జిల్లాలోనూ ఇలాంటిదే మరో ఘటన వెలుగుచూసింది. షరీఫ్‌పూర్ గ్రామంలో ఓ మహిళ (32).. తన పక్కింట్లో ఉండే యువకుడి(26)పై కత్తితో దాడిచేసి జననాంగాల్ని కోసేసింది. నిందితురాలిపై పోలీసులు కేసు నమోదుచేశారు.

సైబర్ నేరాల కట్టడికి చక్షు, డీఐపీ

2 పోర్టల్స్‌ను ప్రవేశపెట్టిన కేంద్రం

న్యూఢిల్లీ, మార్చి 5: మోసపూరిత ఫోన్ కాల్స్, టెక్స్ట్ మెసేజ్‌ల ద్వారా మోసపోయిన బాధితులు దానిపై ఎవరికి ఫిర్యాదు చేయాలో తెలియక వదిలేస్తుంటారు. అలాంటి వారికి కేంద్రం ఒక వేదిక కల్పిస్తూ సోమవారం రెండు డిజిటల్ ప్లాట్‌ఫాంలను ప్రారంభించింది. ఇలాంటి బాధితులు సంచార్ సాథీ పోర్టల్‌లోని చక్షు, డీఐపీ ద్వారా తమ ఫిర్యాదులను నమోదుచేయవచ్చు. ఈ రెండు పోర్టల్స్ ద్వారా మోసపూరిత కార్యక్రమాలకు అడ్డుకట్ట పడుతుందని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ చెప్పారు. మోసపూరితమైన కాల్స్, లేదా ఎస్ఎంఎస్‌లు, వాట్సాప్‌లు, ఇతర సామాజిక మాధ్యమాల్లో టెక్స్ట్ రూపంలో వచ్చినా, దాని ద్వారా మోసపోయిన పౌరులు చక్షులో ఫిర్యాదు చేయవచ్చని చెప్పారు. దీంతో నిర్వాహకులు వాటిని పునఃపరిశీలన చేస్తారు. ఒక వేళ పునః పరిశీలనలో విఫలమైతే ఆ నెంబర్‌ను డిస్‌కనెక్ట్ చేస్తారు. ఇటీవల దేశవ్యాప్తంగా సైబర్ నేరాలు పెరిగిపోయాయని, సంస్థలు, వ్యక్తులను టార్గెట్‌గా చేసుకుని ఈ నేరగాళ్లు వివిధ కాల్స్, మెసేజ్‌ల ద్వారా ప్రజలను మభ్యపెట్టడం, లేదా భయపెట్టడం ద్వారా మోసాలకు పాల్పడుతున్నారని ఆయన చెప్పారు.

ఇజ్రాయెల్‌పై క్షిపణిదాడి.. కేరళవాసి మృతి

తీవ్రంగా గాయపడిన మరో ఇద్దరు

జెరూసలేం: ఇజ్రాయెల్‌లోని ఉత్తర సరిహద్దులో వ్యవసాయ కూలీలపై ఉగ్రవాద సంస్థ హెజ్బొల్లా జరిపిన మిసైల్ దాడిలో ఓ భారతీయుడు మృతి చెందగా, మరో ఇద్దరు భారతీయులు తీవ్రంగా గాయపడ్డారు. వీరు ముగ్గురు కేరళకు చెందినవారే. మార్గలియట్ అనే వ్యవసాయ క్షేత్రంపై సోమవారం ఈ దాడి జరిగింది. మృతుడిని కేరళలోని కొల్లాంకు చెందిన 30 ఏళ్ల పట్నిబిన్ మ్యాక్స్‌వెల్‌గా గుర్తించారు. గాయపడిన బుష్ జోసెఫ్ జార్జ్ (31), పాల్ మెల్విన్ (28)కు చికిత్స కొనసాగుతున్నది. తాజా దాడితో ఇజ్రాయెల్‌లోని భారత రాయబార కార్యాలయం అప్రమత్తమైంది. అక్కడ నివసిస్తున్న భారతీయులు సురక్షిత ప్రాంతాలకు తరలిపోవాలని మంగళవారం సూచించింది. ఈ మేరకు అడ్వైజరీ జారీచేసింది. కాగా, మృతిచెందిన మ్యాక్స్‌వెల్ భార్య ప్రస్తుతం గర్భిణి అని, ఇప్పటికే వారికి ఒక కుమారుడు ఉన్నారని అధికారులు తెలిపారు.

సందేశ్‌ఖాలీ కేసు సీబీఐకి

- పశ్చిమ బెంగాల్ పోలీసులకు కలకత్తా హైకోర్టు ఆదేశం
- సుప్రీం కోర్టుకు రాష్ట్ర ప్రభుత్వం

జనవరి 5న టీఎంసీ నాయకుల దాడిలో గాయపడిన ఈడీ అధికారి

సందేశ్‌ఖాలీ, మార్చి 5: పశ్చిమబెంగాల్‌లోని సందేశ్‌ఖాలీలో జనవరి 5న ఈడీ అధికారులపై జరిగిన దాడిపై దర్యాప్తును బెంగాల్ పోలీసుల నుంచి సీబీఐకి బదిలీ చేయాలని మంగళవారం కలకత్తా హైకోర్టు ఆదేశించింది. రాష్ట్ర పోలీసులు పక్షపాతంతో వ్యవహరిస్తున్నారని కోర్టు వ్యాఖ్యానించింది. ఈ కేసులో ఫిబ్రవరి 29న అరెస్ట్ చేసిన ప్రధాన ముద్దాయి, టీఎంసీ నేత షాజహాన్ షేక్‌ను సీబీఐ కస్టడీకి ఇవ్వాలని కోర్టు ఆదేశాలు జారీ చేసింది. మంగళవారం సాయంత్రం 4.30 లోగా తమ ఆదేశాలను పాటించాలని డివిజన్ బెంచ్ తీర్పు ఇచ్చింది. ఈడీ అధికారులపై జరిగిన సామూహిక దాడిపై దర్యాప్తునకు సీబీఐ, రాష్ట్ర పోలీసుల సంయుక్త ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేయాలని జనవరి 17న సింగిల్ బెంచ్ ఉత్తర్వులిచ్చింది. దీన్ని సవాల్ చేస్తూ ఈడీతో పాటు రాష్ట్ర ప్రభుత్వం వేర్వేరుగా అప్పీల్ చేశాయి.

సుప్రీం కోర్టుకు రాష్ట్ర ప్రభుత్వం

ఈడీ అధికారులపై దాడి కేసు దర్యాప్తును సీబీఐకి అప్పగించాలని కలకత్తా హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ మంగళవారం పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం సుప్రీం తలుపులు తట్టింది. షేక్ షాజహాన్‌ను సీబీఐకి అప్పగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిరాకరించింది.

రాష్ట్రపతి పాలన విధించండి: ఎన్‌సీడబ్ల్యూ

పశ్చిమ బెంగాల్‌లోని సందేశ్‌ఖాలీ హింస నేపథ్యంలో రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలని జాతీయ మహిళా కమిషన్ కోరింది. మంగళవారం కమిషన్ చైర్‌పర్సన్ రేఖా శర్మ రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో సమావేశమై ఈ మేరకు సిఫారసు చేశారు. గతంలో షెడ్యూల్డ్ కులాల జాతీయ కమిషన్ కూడా టీఎంసీ పాలిత రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన ను సిఫారసు చేసింది. అక్కడ నేటికీ పరిస్థితి చాలా భయంకరంగా ఉన్నదని శర్మ చెప్పారు.

7న బీజేపీలో చేరుతా



తృణమూల్ కాంగ్రెస్‌పై పోరాడుతా :జస్టిస్ అభిజిత్

హైకోర్టు న్యాయమూర్తి పదవికి రాజీనామా

కోల్‌కతా, మార్చి 5: కోల్‌కతా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అభిజిత్ గంగోపాధ్యాయ్ చెప్పినట్టుగానే తన పదవి నుంచి వైదొలిగారు. ప్రత్యక్ష రాజకీయాల్లో చేరబోతున్నానని ఇటీవల ప్రకటించిన ఆయన మంగళవారం తన పదవికి రాజీనామా చేశారు. ఆ తర్వాత కొద్ది గంటలకే బీజేపీలో చేరనున్నట్టు ప్రకటించారు. అధికార తృణమూల్ కాంగ్రెస్ పార్టీ అవినీతికి పర్యాయపదంగా మారిందని, ఆ పార్టీపై కడదాకా పోరాడుతానని విలేకర్ల సమావేశంలో స్పష్టం చేశారు. కోల్‌కతా హైకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ గంగోపాధ్యాయ్ విద్యా రంగానికి సంబంధించిన వివిధ కేసుల్లో తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా తీర్పులు ఇవ్వడం రాజకీయ చర్చకు తెరలేపింది. టీఎంసీ నేతలు తనను రెచ్చగొడుతున్నారని, అందుకే రాజకీయాల్లోకి వచ్చాన న్నారు.

పదోన్నతులపై ఇంత జాప్యమా?

త్వరగా తేల్చకపోతే సహాయ నిరాకరణ

మోదీ సర్కారుకు కేంద్ర ఉద్యోగుల అల్టిమేటం



మోదీ సర్కార్‌కు సహాయ నిరాకరణ విషయమై చర్చిస్తున్న ఢిల్లీలోని కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు

న్యూఢిల్లీ, మార్చి 5: ప్రభుత్వం మొద్దునిద్దుర వదిలి తమ పదోన్నతుల విషయంలో సత్వరమే నిర్ణయం తీసుకోవాలని, లేని పక్షంలో సహాయ నిరాకరణకు దిగుతామని కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు హెచ్చరించారు. పదోన్నతి పొందకుండానే పలువురు ఉద్యోగులు పదవీ విరమణ పొందుతున్నారని ఆరోపించారు. దీని వల్ల వారు పెన్షన్ రూపంలో ఆర్థికంగా చాలా నష్టపోతున్నారని పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం వంద మందికి పైగా సెంట్రల్ సెక్రటేరియేట్ అధికారులు ప్రధాని, హోం, రక్షణ శాఖ తదితర ముఖ్య శాఖల కార్యాలయాలున్న రైసినా హిల్స్‌లో శాంతియుతంగా నిరసన ర్యాలీ చేపట్టారు. 2022లో ఏర్పాటైన క్యాడర్ రివ్యూ కమిటీ (సీఆర్‌సీ) ఇంకా తన నివేదికను సమర్పించలేదు. ఈ కమిటీకి సీఎస్ఎస్ కోసం అడ్మినిస్ట్రేటివ్ మినిస్ట్రీ అయిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్ అధికారులు నాయకత్వం వహిస్తారు. కేంద్ర ప్రభుత్వానికి వెన్నెముకగా పేర్కొనే సీఎస్ఎస్ అధికారులతో కేంద్రం ఇలా ప్రవర్తించటం చాలా బాధాకరమని ఫోరం కార్యదర్శి డీఓపీటీకి పంపిన లేఖలో పేర్కొన్నారు. భారత ప్రభుత్వ పథకాలు, ప్రాజెక్టుల సంఖ్య పెరుగుతున్న దృష్ట్యా వివిధ మంత్రిత్వ శాఖలు, విభాగాలలో మానవ వనరుల కోసం డిమాండ్ పెరిగింది. దీన్ని అంచనా వేయటానికి, తగిన సూచనలు చేయటానికి కేంద్ర ప్రభుత్వం 2022 అక్టోబర్ 27న క్యాడర్ రివ్యూ కమిటీని ఏర్పాటు చేసింది. అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం కనీసం 20 ప్రభుత్వ శాఖలు 2500 కంటే ఎక్కువ పోస్టుల కోసం అభ్యర్థనలు పంపాయి. సీఆర్‌సీ నివేదిక సమర్పించటంలో జాప్యం కారణంగా ఈ విభాగాలన్నీ సిబ్బంది కొరతతో సతమతమవుతున్నాయి.

సహాయ నిరాకరణకు దిగుతం

సమస్య తీవ్రత గుర్తించి ప్రభుత్వం చర్యలు తీసుకోకపోతే సహాయ నిరాకరణ ఉద్యమాన్ని ప్రారంభిస్తామని ఫోరం స్పష్టం చేసింది. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5.30 వరకే పనిచేస్తామని, అదనపు పనిగంటల్లో పనిచేయమని ఫోరం సభ్యులు తేల్చి చెప్పారు.

రైలు ప్రయాణికులకు స్విగ్గీ ఫుడ్

తొలుత విశాఖ, విజయవాడ, బెంగళూరు, భువనేశ్వర్‌లో

న్యూఢిల్లీ: ఫుడ్ డెలివరీ సంస్థ స్విగ్గీ విజయవాడ, విశాఖపట్నం, బెంగళూరు, భువనేశ్వర్ స్టేషన్లలో రైల్వే ప్రయాణికులకు తన సేవలను అందించనున్నట్టు ప్రకటించింది. రాబోయే వారాల్లో దేశంలోని మరో 59 రైల్వే స్టేషన్లకు తమ సేవలను విస్తరించనున్నట్టు తెలిపింది. ఈ మేరకు ఐఆర్‌సీటీసీతో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నట్టు మంగళవారం ప్రకటించింది. రైలు ప్రయాణికులు ఐఆర్‌సీటీసీ యాప్‌లోకి వెళ్లి తమకు ఏ స్టేషన్లలో, ఏ ఆహారం ఆయా స్థానిక రెస్టారెంట్ల నుంచి కావాలో పీఎన్ఆర్ నంబర్ నమోదు చేసి ఆర్డర్ ఇవ్వవచ్చునని స్విగ్గీ సీఈవో తెలిపారు.

క్యాన్సర్‌ను నియంత్రించే బియ్యం?

చెన్నై, మార్చి 5: తమిళనాడులోని తిరువరూర్‌కు చెందిన విజయకుమార్ అనే రైతు 'కరుప్పు కవుని' అనే రకం వరి పండిస్తున్నారు. బ్లాక్ రైస్‌గా కూడా పిలిచే ఈ వరిని పూర్వం తమిళ రైతులు ఎక్కువగానే పండించేవారు. కాలక్రమంలో ఈ వరిని పండించడం ఆగిపోయింది. ఈ బియ్యంలో ఆరోగ్యానికి మేలు చేసే అనేక గుణాలు ఉన్నాయి. ముఖ్యంగా శరీరంలో క్యాన్సర్ కణాలు తయారుకావనే నమ్మకం ఉంది. చర్మ క్యాన్సర్ రాకుండా ఈ బియ్యం నియంత్రిస్తుందని చాలామంది నమ్ముతారు. పలు అధ్యయనాల్లోనూ మిగతా రకాల బియ్యంతో పోలిస్తే కరుప్పు కవుని బియ్యంలో యాంటీఆక్సిడెంట్లు, పోషకాలు ఎక్కువగా ఉన్నట్టు తేలింది. దీంతో గత పదేండ్లుగా ఈ వరిని పండిస్తున్నారు

రీసైకిల్ చేసిన ప్లాస్టిక్‌లో విష రసాయనాలు

న్యూఢిల్లీ, మార్చి 5: రీసైకిల్ చేసిన ప్లాస్టిక్‌లో ఆరోగ్యానికి హానికరమైన విష రసాయనాలు ఉన్నాయని 'టాక్సిక్ లింక్స్' అనే స్వతంత్ర అధ్యయన సంస్థ గుర్తించింది. ఢిల్లీకి చెందిన ఈ సంస్థ.. రీసైకిల్ చేసిన ప్లాస్టిక్ ద్వారా తయారుచేసిన వస్తువులపై అధ్యయనం జరపగా హానికరమైన రసాయనాలు ఉన్నట్టు తేల్చింది. ఈ ప్లాస్టిక్‌ను పిల్లలు ఆడుకునే బొమ్మలు తయారీకి, ఆహారాన్ని ప్యాక్ చేయడానికి, వంటింటి సామాగ్రి తయారీకి వినియోగిస్తున్నారని, ఇది మనుషుల ఆరోగ్యాలకు పెనుముప్పుగా మారుతున్నదని ఈ సంస్థ పేర్కొన్నది. మన దేశంలో ప్లాస్టిక్ రీసైక్లింగ్ ఎక్కువగా అనధికారికంగానే జరుగుతున్నదని, ఇక్కడ ఎలాంటి నాణ్యత, భద్రత తనిఖీలు జరగడం లేదని తెలిపింది.

మూడు వేల ఏండ్ల లేటు!



(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్ (నమస్తే తెలంగాణ): అసలు గ్రహాంతరవాసులు ఉన్నారా? ఉండి ఉంటే మనలాగే ఉంటారా? భూమిని, మనుషుల్ని చూస్తుంటారా? ఎప్పుడైనా భూమి మీదకు వచ్చారా? ఇలా అనేక అంతుచిక్కని ప్రశ్నలు మానవాళిని నిత్యం వేధిస్తూనే ఉంటాయి. ఈ ప్రశ్నలకు సమాధానాలు కనుగొనేందుకు అనేక పరిశోధనలు జరుగుతూనే ఉన్నాయి. అమెరికాలోని సెర్చ్ ఫర్ ఎక్స్‌ట్రాటెరెస్ట్రియల్ ఇంటెలిజెన్స్(సెటి) అనే సంస్థ ప్రత్యేకంగా ఈ పరిశోధనలే చేస్తూ ఉంటుంది. తాజాగా ఈ సంస్థకు చెందిన శాస్త్రవేత్తలు గ్రహాంతరవాసులకు సంబంధించి ఒక కొత్త విషయాన్ని చెప్తున్నారు. గ్రహాంతరవాసులు భూమిని చూస్తుండవచ్చని, కాకపోతే రియల్ టైమ్‌లో చూడలేరని వీరు అంచనా వేస్తున్నారు. 3,000 ఏండ్ల క్రితం నాటి భూమిని, నాగరికతను, కట్టడాలను ఏలియెన్స్ ఇప్పుడు చూస్తుండవచ్చని చెప్తున్నారు. ఈ ఆలస్యానికి వారు ఒక కారణాన్ని కూడా చెప్తున్నారు. భూమికి అనేక వేల కాంతి సంవత్సరాల దూరంలో ఏలియన్స్ ఉంటారు కాబట్టి ఇక్కడి నుంచి అక్కడికి కాంతి ప్రయాణించడానికి చాలా సమయం పడుతుందట. ఈ ప్రయాణ సమయం 3,000 ఏండ్లు ఉండొచ్చని శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. కాబట్టి ఇప్పుడు ఏలియన్స్ వాళ్ల అత్యాధునిక టెలిస్కోప్‌లతో భూమిని చూస్తున్నప్పటికీ వారికి కనిపించేది మాత్రం 3,000 ఏండ్ల క్రితం నాటి భూమి అని, అప్పటి రోమన్లు, గ్రీకులు, భారతీయులు, ఈజిప్టియన్ల నాగరికతను ఏలియన్స్ ఇప్పుడు చూస్తుండవచ్చని భావిస్తున్నారు.

కొవిడ్ వేళ పుట్టిన పిల్లల్లో జీవపర మార్పులు

డబ్లిన్, మార్చి 5: కొవిడ్ సమయంలో పుట్టిన పిల్లల్లో జీవపరమైన మార్పులు చోటు చేసుకున్నాయని ఐర్లాండ్‌కు చెందిన పరిశోధకులు గుర్తించారు. ఐర్లాండ్‌లోని కాలేజ్ కార్క్ విశ్వవిద్యాలయానికి చెందిన పరిశోధకులు.. కొవిడ్ వేగంగా వ్యాప్తి చెందిన 2020 మార్చి నుంచి మే నెల మధ్య జన్మించిన 351 మంది మల నమూనాలపై అధ్యయనం జరిపారు. కొవిడ్ వేళ జన్మించిన శిశువుల్లో గట్ బ్యాక్టీరియాలో మార్పులు వచ్చాయని గుర్తించారు. కొవిడ్‌కు ముందు జన్మించిన పిల్లల్లో ఏడాది వయసు వచ్చే నాటికి 22.8 శాతం మందిలో ఫుడ్ అలర్జీలు కనిపించగా, కొవిడ్ సమయంలో పుట్టిన పిల్లల్లో మాత్రం కేవలం ఐదు శాతం మందికే ఫుడ్ అలర్జీలు కలిగినట్టు తేల్చారు.

'స్కై'.. బార్న్ ఇన్ ది ఎయిర్

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్ (నమస్తే తెలంగాణ): 'త్రీ ఇడియట్స్' సినిమా దృశ్యం తైవాన్–బ్యాంకాక్ విమానంలో పునరావృతమైంది. విమానం టేకాఫ్ అయిన కాసేపటికి ఓ గర్భిణికి పురిటి నొప్పులు మొదలయ్యాయి. బాత్‌రూంలో ఆమెను చూసిన సిబ్బంది విషయాన్ని పైలట్ జాకరిన్‌కు తెలియజేశారు. ల్యాండింగ్ చేద్దామంటే నడి సముద్రం పైన విమానం ప్రయాణిస్తున్నది. దీంతో తన బాధ్యతలను మహిళా కో–పైలట్‌కు అప్పగించిన జాకరిన్.. ఫోన్‌కాల్ ద్వారా వైద్యులను సంప్రదించి వారి సూచనలతో పురుడు పోశాడు. 30 వేల అడుగుల ఎత్తులో పుట్టిన చిన్నారికి సిబ్బంది ముద్దుగా 'స్కై' అని పేరు పెట్టారు.